క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్



ఎస్‌ఐకి రాఖీ కట్టిన విద్యార్థినులు

కందుకూరు: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు లిఖిత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు పీఎస్‌లో కానిస్టేబుళ్లు, ఎస్‌ఐకి విద్యార్థినులు రాఖీలు కట్టారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు కీర్తన, తరుణ్, శ్వేత, శిరీష, రమ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ రవికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: ఆదిబట్ల ఠాణా సీఐగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను శుక్రవారం సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం , ఏఐడబ్ల్యూటీయూ అధ్యక్షురాలు ఆర్. ఝాన్సీ, బి.భానుప్రసాద్, సురేష్ కుమార్, సీహెచ్ రాజు ఉన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

తుక్కుగూడ: పుర పరిధి పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు సామూహిక వ్రతాలు చేశారు. లక్ష్మీ దేవతకు ప్రత్యేకాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు రక్షాబంధన్



రాఖీ దుకాణం

తుక్కుగూడ: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో రాఖీ విక్రయ దుకాణాలు వెలిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం రాఖీ, మిఠాయి దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న రాఖీల కొనుగోలుకు ఆడబిడ్డలు మక్కువ చూపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



విజేత జట్టుతో కమిషనర్ అమరేందర్ రెడ్డి

తుర్కయంజాల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అన్నారు. తుర్కయంజాల్, ఆదిబట్ల పురపాలక సంఘాల ఉద్యోగుల మధ్య శుక్రవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను కమిషనర్లు అమరేందర్ రెడ్డి, బాలకృష్ణలు ప్రారంభించారు. ఈ పోటీలో తుర్కయంజాల్ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పండుగ సాయన్నకు నివాళి

నాగోలు: నిజాం రాజ్యంలో తిరుగుబాట్లు, ఉద్యమాలు చేసిన నాయకుడు పండుగ సాయన్న అని మన ఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర అధ్యక్షుడు కటకం నర్సింగ్ రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం నాగోలులోని మాస్ కేంద్ర కార్యాలయంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కటకం నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. పండుగ సాయన్న పేద ప్రజలకు సహాయం చేసే వాడిగా గుర్తింపు పొందాడన్నారు. ప్రజల కోసం ఆధిపత్య వర్గాలపై ఎనలేని పోరాటం చేశాడని గుర్తు చేశారు. బ్రహ్మయ్య మాట్లాడుతూ.. రాబిన్ వుడ్ లాగా పండుగ సాయన్న కేవలం ధనవంతులను కొట్టి పేదవారికి పెట్టే పనిపెట్టుకోలేదు. నిరంకుశ నిజాం అధికారులను ప్రశ్నించి వారిని ఎదిరించి తన సొంత పాలన వ్యవస్థను స్థాపించుకొని ఒక సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించే ప్రయత్నం చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, కాశీనాథ్, పాల్గొన్నారు.

నేడు నూలు పూర్ణిమ గాయత్రీయజ్ఞం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణం శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయంలో శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా 39వ నూలు పూర్ణిమ గాయత్రీయజ్ఞం, యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రచారంలోనే 'అభివృద్ధి'!

కాలనీల్లో కనిపించని కనీస వసతులు

- సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు
- కార్పొరేషన్‌కు సొంత యంత్రాలు సమకూర్చుకోలేని అసమర్థత
- చెత్త సేకరణకు సైతం సరైన వాహనాలు లేని వైనం
- పాలకులు, అధికారుల తీరుపై ప్రజల మండిపాటు



చెత్త సేకరించే ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసేందుకు నెడుతున్న సిబ్బంది

బడంగ్‌పేట్: సుమారు రూ.400 వందల కోట్లతో మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేశామని చెబుతున్న గత పాలకులు, వీరికి వత్తాసు పలుకుతూ అధికారులు ఒకరుకు మించి మరొకరు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయని ప్రజలు మండిపడుతున్నారు. ఆరు నెలల క్రితం పదవీ కాలం పూర్తయిన గత పాలకులు, అధికారులు కుమ్మక్కై కార్పొరేషన్‌ను అవినీతిమయంగా మార్చేశారనే ఆరోపణలున్నాయి. కనీసం రోజూవారీ పనుల నిర్వహణ కోసం అవసరమై యంత్రాలు సమకూర్చుకోవడంలోనూ విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒకే గల్ఫర్ మిషన్‌తో పనులు

2013లో నగర పంచాయతీగా ఏర్పడినప్పుడు చెత్త సేకరణ, ఇతర అవసరాలకు నాలుగు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. అందులో ఒక ట్రాక్టర్‌కు నంబర్ ప్లేట్ రాకముందే దొంగలు ఎత్తుకెళ్లారు. ఇక మిగిలిన ట్రాక్టర్లతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. నాడే ఒక చిన్న గల్ఫర్ మిషన్‌ను తీసుకొచ్చారు. వాటితోనే పనులు కొనసాగిస్తున్నారు. అయితే నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీకి, మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా బడంగ్‌పేట అవతరించింది. కార్పొరేషన్ అభివృద్ధికి రూ.400 కోట్లు ఖర్చు చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ కావాల్సిన పర్మినెంట్ పరికరాలు(ట్రాక్టర్లు, జేసీబీలు, గల్ఫర్‌లు వగైరా) ఒక్కటి కూడా కొనుగోలు చేయడంలో విఫలమయ్యారు.

ఎందుకు కొనుగోలు చేయలేదో?

కార్పొరేషన్‌లో సుమారు మూడు లక్షల జనాభా ఉంది. నిత్యం 8 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 4 వందలకుపైగా కాలనీలు ఉండగా.. నిత్యం పది కాలనీలకుపైగా డ్రైనేజీ పొంగుతోందని ఫిర్యాదులు. సిబ్బంది ఉన్నా వారికి సరిపడా పరికరాలు, వస్తువులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా కార్పొరేషన్‌లో వెనకటి కాలంలో మోరీలకు దిగి మురుగు శుద్ధి తొటగించినట్టే.. ప్రస్తుతం సిబ్బంది చేత కొన్ని చోట్ల పనులు చేయిస్తున్నారు. చిన్న గల్ఫర్ మిషన్‌తో రెండు డ్రైనేజీలు శుభ్రం చేసే స్థాయి మాత్రమే ఉంది. ఇంత పెద్ద కార్పొరేషన్‌లో ఎందుకు పెద్ద గల్ఫర్ మిషన్‌ను కొనుగోలు చేయడంలేదో అధికారులకే తెలియాలి. సెల్ఫ్ లేని ట్రాక్టర్లతో గల్లీలకు వచ్చి బండి ఆగిపోతే తోయడానికి కాలనీవాసులకు సిగ్గు అనిపించి ముందుకు రాకపోవడంతో నిత్యం చెత్తను సేకరించి ఆగిన బండ్లను పారిశుద్ధ్య సిబ్బందే తోసుకొని వెళ్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది పడుతున్న కష్టాలు అధికారులు ఎందుకు గుర్తించడం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

ప్రచార ఆర్భాటమే ..

పాలకులు పలు పార్టీల నుంచి వచ్చినవారు కావడంతో తమకు, తమ పార్టీలకు మెప్పు వస్తుందని ప్రచారం చేసుకోవడంలో అర్థం ఉంది. కానీ అధికారులు సైతం అదే ప్రచార ఆర్భాటంలో మునిగిపోతున్నారు. నిజమేనని పబ్లిక్ నమ్ముతోంది. అంతా విప్పి చూస్తే డొల్లతనం కనిపిస్తోంది. సొంత కార్పొరేషన్‌లో పర్మినెంట్ పరికరాలు, వస్తువులు కొనుగోలు చేయకుండా సిబ్బంది చేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ప్రజా సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకొని కార్పొరేషన్‌కు కావాల్సిన ట్రాక్టర్లు, లారీలు, బుల్డోజర్లు, జేసీబీలు, గల్ఫర్ మిషన్‌లు, ఇతరత్రా వాటిని కొనుగోలు చేసి సిబ్బంది పడుతున్న శ్రమను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

అవినీతిలో కూరుకుపోయింది



మున్సిపల్ కార్పొరేషన్ మొత్తం అవినీతిలో మునిగిపోయాయి. సామాన్యుడికి పనులు కావడం లేదు. పైసలిస్తేనే ఫైల్ కదులుతోంది. ఇప్పటికే చాలాసార్లు విన్నపాలు, ధర్నాలు నిర్వహించిన అధికారుల్లో చలనం లేదు. కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పడం కాదు.. ముందు సిబ్బంది కష్టాలు తీర్చాలి.

– రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, బీజేపీ నేత

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

పరిసరాల పరిశుభ్రత పాటించాలి: వైద్య సిబ్బంది



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

మీర్‌పేట: వానాకాలం. ఆపై సీజనల్ వ్యాధుల కాలం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.బాలమణి సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో యూపీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెబుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. సర్వేలో భాగంగా రెండు రోజులకు పైగా ఎవరికైనా జ్వరం లక్షణాలు ఉంటే.. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించుకోవాలి



మట్టి గణపతికి రాఖీలు కడుతున్న చిన్నారులు

వనస్థలిపురం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం ప్రతినిధులు రాబోయే వినాయక చవితిని దృష్టిలో ఉంచుకుని రాఖీ పండుగ సందర్భంగా వినూత్న కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం వనస్థలిపురంలో పర్యావరణ మట్టి గణపతికి చిన్నారులచే రాఖీలు కట్టించి వినాయక చవితిని పర్యావరణ ప్రియంగా జరుపుకుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ మాట్లాడుతూ.. రసాయనిక రంగులతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ గణపతులు పర్యావరణానికి హానికరమని, మట్టి గణపతులనే ప్రతిష్ఠించేలా విద్యార్థులు చొరవ చూపాలన్నారు. నిర్వాహకులు మండపాల వద్ద ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వాడవద్దని, ప్రత్యామ్నాయంగా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, చెర్రి, ప్రీతి, క్రితిక, దీక్షిక, గోమయి, పవిత్ర, హర్షిత, విఘ్నేష్, బాలు, మహేష్, రామ్‌దాస్ పాల్గొన్నారు.

చెరువులోకి నీరు చేరేలా చర్యలు చేపట్టాలి



చిన్నచెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీలలో డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతందని జలమండలి, సివరేజీ బోర్డు అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. గణేష్‌నగర్‌కాలనీలో గతంలో చిన్న పాటి వర్షానికే వరదనీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడేవారని, వరదకాలువ పూర్తిచేయటంతో సమస్య తీరిందన్నారు. భారీ వర్షం కురిసినా చెరువులోకి చుక్క నీరు చేరలేదని, వరద కాలువలు పునరుద్ధరణ చేసి చిన్న చెరువులోకి నీరు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. వీకర్‌సెక్షన్ కాలనీలో వరద కాలువకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

నిధుల మంజూరుకు వినతి



ఎండీకి వినతి పత్రం ఇస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి



మేయర్‌కు వినతిపత్రం ఇజేస్తున్న సుజాతనాయక్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లోని డ్రైనేజీల ఆధునీకరణకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి వాటర్ వర్క్స్ ఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్‌లోని చాలా కాలనీల్లో దశాబ్దాల క్రితం నాటి డ్రైనేజీలు చిన్నపాటి వర్షాలకు పొంగి పొర్లుతున్నాయన్నారు. డివిజన్‌లోని ఆయా ప్రాంతాలలో అస్తవ్యస్తంగా ఉన్న సీవరేజీ పైపులైన్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతన డ్రైనేజీలను ఆధునీకరిస్తే సమస్య పరిష్కారమవుతుందని విజ్ఞప్తి చేశారు.

మేయర్‌కు వినతి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని కొత్తకాలనీలు వెలుస్తున్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. వివిధ కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేయాలని శుక్రవారం ఆమె జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీ, గణేశ్‌నగర్‌కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.88 కోట్లు మంజూరు చేయించామని అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినత ఆర్వాత డివిజన్‌కు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేశామన్నారు.

ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడ జాతీయ రహదారి వద్ద నూతనంగా నిర్మించనున్న హైకోర్టు కాలనీ ముఖద్వారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, దీపావళి శ్రవణ్‌కుమార్, గుత్తా లక్ష్మారెడ్డి, వెంకటస్వామి యాదవ్, కే.ఎల్.నర్సింహారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

ఆమనగల్లు: హరిత ఆమనగల్లు లక్ష్యంగా ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నామని ఆమనగల్లు మున్సిపాలిటీ కమిషనర్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ పరిధి 7,9,11 వార్డుల్లో మొక్కలు అందజేశామని తెలిపారు. ప్రజలు వాటిని నాటి, సంరక్షించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది సత్యనారాయణ, ఎల్లయ్య, సురేందర్, గౌతమి, రమేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మాజీ ప్రజాప్రతినిధులు

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు చోట్ల మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పత్యానాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, కడ్తాల్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎల్.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోతాదు మించితే ముప్పే

- చీడపీడలతో పంటకు నష్టం
- అవసరం మేరకు యూరియా వాడాలి
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి
- ఆమనగల్లు ఏడీఏ శోభారాణి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

ఆమనగల్లు: పంటలకు తగిన మోతాదులో యూరియాను వేయాలని ఆమనగల్లు ఏడీఏ శోభారాణి అన్నారు. ఎక్కువగా వాడటం వలన చీడపీడల బెడద అధికమై.. పంట నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలంలో శుక్రవారం ఆమె రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ డివిజన్ పరిధి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో పత్తి, మొక్కజొన్న, వరి పంటలను సుమారు 1.15 లక్షల ఎకరాల్లో సాగుచేశారని తెలిపారు. వరికి ఎకరాకు ఒక బస్తా డీఏపీ, 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాషియం మొదటి దఫాగా దుక్కిలో వేయాలని రైతులకు సూచించారు. వరి పంట పిలకల దశలో 30 కిలోల యూరియా, పొట్టదశలో 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరెట్ పొటాషియం వినియోగించాలన్నారు. ఎక్కువగా వాడితే వృథా అవుతుందని పేర్కొన్నారు.

పత్రహరితం పెరిగి..

మొక్కజొన్న సాగు ఎకరాకు ఒక బస్తా డీఏపీ, 25 కిలోల మ్యూరెట్ పొటాషియం దుక్కిలో వేయాలని, పంట మోకాలు ఎత్తు దశలో 45 కిలోల యూరియా, కంకి దశలో 45 కిలోల యూరియా వేయాలని ఏడీఏ చెప్పారు. అధిక మోతాదులో వేస్తే.. ఆకులలో పత్రహరితం పెరిగి, పురుగులను ఆకర్షిస్తుందని వివరించారు. దీనివలన పంటలో చీడపీడల సమస్య అధికమవుతుందన్నారు. పంట కాలం మొత్తానికి 2 బస్తాల యూరియా వేస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. పత్తికి ఎకరాకు ఒక బస్తా డీఏపీ, 30 కిలోల యూరియా వేయాలన్నారు. పంట తొలపూత దశలో 30 కిలోల యూరియా, మొగ్గదశలో 30 కిలోల యూరియా వాడాలని తెలిపారు. పత్తి పంటలో కాంప్లెక్స్ ఎరువులతో యూరియాను కలిపి వేయడం వలన ఖర్చు భారం అవుతుందన్నారు. యూరియా మోతాదు మించితే చీడపీడల బెడద పెరుగుతుందని, భూమి లోపల ఉండే పోషకాలను మొక్కకు అందించే సూక్ష్మజీవులు చనిపోయి భూసారం తగ్గి, క్రమంగా భూమి నిస్సారమవుతుందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి.. అధిక దిగుబడులు పొందాలని ఏడీఏ రైతులకు సూచించారు.

వరలక్ష్మీ నమోస్తుతే..



ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మీ అమ్మవారు

దిల్‌సుఖ్‌నగర్/సైదాబాద్: శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. అమ్మవారి ఆలయాలన్నీ ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. సైదాబాద్ డివిజన్ మాతామైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గా మాతా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆర్‌కే పురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, మాదన్నపేట్‌లోని దుర్గాదేవి ఆలయం, శ్రీవిజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాలలోని అమ్మవారి ఆలయాలు, ఇళ్లలో శ్రావణమాస వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరుపుకున్నారు.



ఆలయం ఎదుట భక్తుల సందడి



కరెన్సీ నోట్ల అలంకరణలో విజయదుర్గా మాతా



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



వరలక్ష్మీ వ్రతం పూజల్లో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవాలయంలో లక్ష్మిదేవి అలంకరణలో ఉన్న దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు